

3న వామపక్ష రాష్ట్ర నాయకుల బృందం పర్యటన

ఏలూరు అర్బన్ : మండలంలోని వంకావారిగూడెంలో నిర్మిస్తున్న ఆయుధ డిపో సమస్యపై వామపక్షపార్టీల రాష్ట్రనాయకుల బృందం ఆ ప్రాంత పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఉన్న ప్రజలతో మాట్లాడేందుకు ఈ నెల మూడో తేదీన పర్యటిస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు యు.వెంకటేశ్వరరావు (యువి), వివిధ వామపక్ష పార్టీల జిల్లా నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటన సోమవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగుతుందని వివరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ కేంద్ర కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు హరినాథ్, సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు ఎంఎస్.నాగరాజు, ఎస్‌యు సిఐ రాష్ట్ర నాయకులు సుధీర్, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు, వివిధ వామపక్షపార్టీల నేతల బృందం పర్యటిస్తుందని తెలిపారు.

మద్యం ఏరులు..!

- గతంతో పోలిస్తే రెండు జిల్లాల్లో మద్యం అమ్మకాలు రెట్టింపు
- విచ్చలవిడిగా బెల్టు షాపులు, అనధికార పర్మిట్ రూమ్‌ల్లో ఇష్టానుసారంగా అమ్మకాలు
- ఏడాదిలో 91 శాతం బీర్లు, 18 శాతం లిక్కర్ అమ్మకాలు
- నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నా పట్టని ఎక్సైజ్ అధికారులు
- మద్యం మత్తులో యువత భవిష్యత్తు చిత్తు



ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. విచ్చలవిడిగా బెల్ట్ షాపులు, అనధికార పర్మినెంట్ రూములు, నైట్ పాయింట్లు, డోర్ డెలివరీ వంటి సదుపాయాలతో రెయింబవళ్లు తాగిన వాళ్లకు తాగినంత పుష్కలంగా దొరుకుతుంది. గతంతో పోలిస్తే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో మద్యం అమ్మకాలు రెట్టింపయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆధీనంలోని మద్యం అమ్మకాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీని తీసుకొచ్చారు. అయితే ఏడాది కాలంలోనే రెండు జిల్లాల్లో మద్యం అమ్మకాలు దాదాపు రెట్టింపయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 175 మద్యం దుకాణాలు, ఏలూరు జిల్లాలో 144 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో కలిపి కల్లుగీత కార్మికులకు అదనంగా సుమారు మరో 50 మద్యం దుకాణాల వరకూ ఉన్నాయి. జిల్లాలో రోజుకు సుమారు రూ.4 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతాయని అంచనా. ఏలూరు జిల్లాలో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం ఎక్సైజ్ అధికారులకు నెలవారీ టార్గెట్లు విధిస్తోంది. అమ్మకాలపై 20 నుంచి 30 శాతం అమ్మకాలు పెంచాలని ఒత్తిడి తెస్తోంది. ఏదో విధంగా సేల్స్ పెంచుకునేందుకు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారింది. ఒక్కో షాపు పరిధిలో రెండు నుంచి ఐదు వరకూ బెల్టులు నిర్వహిస్తున్నారు. షాపుల వద్దే మద్యం సేవించేందుకు టేబుళ్లు, కుర్చీలతో సిట్టింగ్ ఏర్పాట్లు, మంచింగ్ కోసం ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, సోడా, డ్రింక్, వాటర్ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. లూజ్ సేల్స్, నైట్ పాయింట్లు పేరిట వేళాపాళా లేకుండా మద్యం అమ్మకాలు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం పట్టించుకోవట్లేదు.


నిబంధనలకు పాతర.. భారీగా పెరిగిన మద్యం అమ్మకాలు

గత ప్రభుత్వంలో మద్యం దుకాణాలు ప్రభుత్వ ఆధీనంలో ఉండడంతో నిబంధనలు కచ్చితంగా అమలయ్యేవి. నిర్ణీత వేళల్లో మాత్రమే అమ్మకాలు జరిగేవి. షాపు వద్ద మద్యం కొనుగోలు చేసి తీసుకుపోవడమే తప్ప అక్కడ తాగే వీలుండేది కాదు. నాటి పరిస్థితికి పూర్తి భిన్నంగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం అమ్మకాలు చేస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. అయితే ఇటు ప్రభుత్వం గానీ ఎక్సైజ్ అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు కనిపించట్లేదు. ఎక్సైజ్ శాఖ తూతూ మంత్ర చర్యలతో చేతులు దులుపుకుంటోందనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాలతో పోలిస్తే ఈ ఏడాది కాలంలో మద్యం వినియోగం భారీగా పెరిగింది. గత ప్రభుత్వంలో 2023 అక్టోబరు నుంచి 2024 సెప్టెంబరు నెలాఖరు నాటికి జిల్లాలో 15,63,135 లిక్కర్, 4.40,948 బీరు విక్రయాలు జరిగాయి. కూటమి పాలనలో 2024 అక్టోబరు నుంచి 2025 సెప్టెంబరు నెలాఖరు వరకూ 18,42,683 లిక్కర్, 8,40,648 కేసుల బీర్ల అమ్మకాలు జరగడం గమనార్హం. లిక్కర్ సేల్స్ 18 శాతం పెరగ్గా, బీర్ల వినియోగం దాదాపు రెట్టింపు కావడం విశేషం.

మద్యం మత్తులో యువత భవిష్యత్తు చిత్తు

మద్యం మత్తులో యువత జోగుతోంది. మద్యానికి బానిసై భవిష్యత్తు ఛిద్రమవుతున్న పరిస్థితి ఉంది. గతంతో పోలిస్తే అటు లిక్కర్ ఇటు బీర్ల అమ్మకాలు తారస్థాయికి చేరాయంటే దీనికి ప్రధాన కారణం యువతే. అన్ని వేళలా మద్యం అందుబాటులో ఉండడం, తాగేందుకు వేళాపాళా లేకపోవడంతో యువత మద్యం జోష్‌లోనే సాగుతోంది. బీర్లు తాగే వారిలో అధిక శాతం మంది యువతే. ఈ ఏడాది కాలంలో బీర్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో 91 శాతం పెరిగాయి. డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పోలీసులకు పట్టుబడుతున్న వారిలో యువకులే అధికంగా ఉంటున్నారు. మద్యం మత్తులో జోగుతూ భవిష్యత్తును చిత్తు చేసుకుంటున్నారు. ఇటీవల కాళ్ల మండలం ఎల్ఎన్.పురంలో చెరువుల వద్ద ఇద్దరు యువకులు కలిసి మద్యం సేవిస్తుండగా తలెత్తిన వివాదం ఒకరి నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. భీమవరంలో ఒక ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఇద్దరు యువకుల మధ్య తలెత్తిన వివాదంలో ఒకరికొకరు బ్లేడ్లతో దాడికి దిగడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఇలా చెప్పుకుంటూపోతే జిల్లాలో అనేక సంఘటనలు రోజువారీ జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం మద్యం అన్నివేళలా అందుబాటులో ఉండడమేనని తెలుస్తోంది. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న పరిస్థితి. ఇటీవల జరిగిన ఘటనలే దీనికి నిదర్శనంగా చెప్పొచ్చు.



చెక్కు అందజేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు జీవనాడి

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - వేలేరుపాడు

రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు ఒక జీవనాడి అని పోలవరం ఒక వరమని నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసిత సమస్యలు తెలుసుకోవడానికి నిమ్మల రామానాయుడు శనివారం వేలేరుపాడులో పర్యటించారు. ముందుగా కూటమి నాయకులు మంత్రి నిమ్మలకు, ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు మేడిపల్లి వద్ద మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పోలవరం నియోజకవర్గం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఆర్అండ్ఆర్ కమిషనర్ ప్రశాంతి, ఉమ్మడి జిల్లాల జెడ్‌పి ఛైర్మన్ గంటా పద్మశ్రీ తదితరులు మాట్లాడారు. అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల విషయంలో న్యాయం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేయాలన్నారు. నిర్వాసితుల బాధలు తెలుసుకొని వారికి భూ సేకరణ నిమిత్తం, నిర్వాసితుల ప్యాకేజీ , పునరావాసం నిమిత్తం రూ.వెయ్యి కోట్లు పోలవరం ప్రత్యేక అకౌంట్‌కు జమ చేస్తున్నట్లు తెలిపారు. నిర్వాసితులకు సాయం అందించడంలో ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుం డా స్వయంగా వెళ్లి నిర్వాసితులకు అందజేయాలని తెలియజేశారన్నారు. పోలవరం ప్రాజెక్టును గత వైసిపి ప్రభుత్వం విధ్వంసం చేసిందని, నిర్వాసితులను పట్టించుకోలేదని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాం లోని సొంత రాష్ట్ర పెట్టుబడులు పెట్టి నిర్మాణాలు చేపట్టి 84 శాతం పూర్తిచేసినా గానీ వైసిపి ప్రభుత్వ హయాంలో కేంద్ర గవర్నమెంట్ రూ.3,385 కోట్ల ప్రాజెక్టు కోసం ప్రత్యేక గ్రాండ్ రిలీజ్ చేసినా ఆ నిధులను వైసిపి దారి మళ్లించారని విమర్శించారు. ఇప్పుడు ప్రధాని మోడీ ఆశీస్సులతో సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి రాష్ట్రం ముందుకు దూసుకెళ్తోందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు కోసం ఏడు మండలాల ప్రజలున్న ఊరును, పుట్టి పెరిగిన ఊరును సర్వం వదిలేసి రాష్ట్రం కోసం త్యాగం చేస్తున్నారని తెలిపారు. ఏ ఒక్క నిర్వాసితుడికీ అన్యాయం జరగకూడదని మొదటి ఫేజ్ అయినా 41.15 కాంటూర్ లెవల్‌లో ఉన్న నిర్వాసి తులు 38,060 మంది కుటుంబాలకు గాను 19,954 కుటుం బాలకు పరిహారం అందించామని తెలిపారు. అలాగే లక్షా 99 ఎకరాలకు గాను 86,985 ఎకరాలు భూమి సేకరించి 87 శాతం పూర్తి చేశామని తెలిపారు. అలాగే రెండో దశలో 45.72 కాంటూర్ లెవల్‌లో 67,662 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉండగా 29,727 ఎకరాలు భూసేకరణ చేశామని తెలిపారు. ఆర్అండ్ఆర్ పరిహారంలో గానీ , ఇంటి విలువల్లో కానీ ఎలాంటి తేడాలున్నా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాల న్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితు ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం నిర్వాసితుల సమస్యలు తెలుసుకుని వారి వద్ద నుంచి నేరుగా మంత్రి రామానాయుడు వినతి పత్రాలు తీసు కొని ప్రతి ఒక్క రికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చా రు. ఆర్‌డిఒ వెంకటరమణ, ఐటిడిఎ పిఒ రాములు నాయక్, టిడిపి మండలాధ్యక్షులు అమరవరం అశోక్, జనసేన మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ పాల్గొన్నారు.

పేదలు, దళితుల పట్ల నిరంకుశత్వం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు




అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం పేదలు, దళితుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. శనివారం ఏలూరులో అన్నే వెంకటేశ్వరరావు భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అధ్యక్షతన అసైన్డ్ భూములు ఫ్రీ హోల్డ్ చేయడం, 9/77 చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి వ్యతిరేకంగా రాష్ట్రస్థాయి చర్చా వేదిక నిర్వహించారు. ఈ చర్చా వేదికకు ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దళితులు పేదలకు సంక్షేమ పథకాల సాకు చూపి సాగు చేసుకుంటున్న భూములను సైతం భూస్వాములకు కట్టబెట్టే ప్రయత్నానికి ఈ ప్రభుత్వాలు పూనుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసైన్మెంట్ భూముల విధానంలో భూ కబ్జాదారులకు తీపి కబురు, లక్షలాది మంది దళిత, బలహీనవర్గాలకు చేదు కబురుగా ఉందని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల కోసం అహర్నిశలూ పనిచేసిన మహానుభావుడు ఎస్ఆర్.శంకరన్ పోరాడి 9/77 చట్టం తీసుకొస్తే నేటి కూటమి ప్రభుత్వం ఈ చట్టాన్ని పేదలకు దూరం చేయాలనే చట్టంలో ఉన్న విషయాలను సవరిస్తూ నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన ఐదు దశాబ్దాలుగా ప్రభుత్వాల నుంచి లబ్ది పొందిన దళిత, బలహీన వర్గాలకు చెందిన అసైన్డ్ భూములను పలుకుబడి కలిగిన వారికి, గ్రామీణ సంపన్నులకు కట్టబెట్టడానికే ఈ ఫ్రీహోల్డ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడానికి రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం చేసిందిని విమర్శించారు. 2023లో అప్పటి వైసిపి ప్రభుత్వం గడిచిన 50 ఏళ్లలో అసైన్డ్ భూములు పొందిన పేదలు 20 ఏళ్లు అనుభవించిన తర్వాత అమ్ముకోవచ్చు, కొనుగోలు చేయొచ్చని 9/77 చట్టాన్ని సవరించడానికి ప్రయత్నిస్తే దానికి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక, దళిత సంఘాలు, ఇతర ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాడిన ఫలితంగా ప్రభుత్వం వెనక్కి తగ్గిందని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయడానికి వ్యవసాయ కార్మిక సంఘం పూనుకుందన్నారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనారావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, చేతి వృత్తుల సంఘం జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ విధానాలు పేదలకు నష్టం కలిగించేలా ఉన్నాయన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు చెందిన భూములను గుర్తించడానికి కోనేరు రంగారావు భూకమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆ కమిటీ ఇచ్చిన నివేదికను అప్పటి ప్రభుత్వం నుంచి నేటి ప్రభుత్వాల వరకూ అమలు చేయడంలో వైఫల్యం చెందాయిని విమర్శించారు. నాడు చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములపై సమగ్రంగా విచారించి అక్రమంగా స్వాధీనం చేసుకున్న పెత్తందారుల నుంచి భూములు వెనక్కి తీసుకొని తిరిగి పేదలకు ఇస్తామని చెప్పిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఎక్కడా ఒక్క ఎకరం అనర్హుల చేతుల్లో ఉన్న భూమి తీసుకొని పేదలకు పంచలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇదే పద్ధతి కొనసాగిస్తే వ్యవసాయ కార్మిక సంఘం, సామాజిక సంఘాలను, కలిసొచ్చే సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలకు సిద్ధం అవుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని చర్చా వేదిక ద్వారా హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.రాజశేఖర్, ఎ.ప్రభాకర్, భూములు కోల్పోయిన పేదలు అశోక్, బాలస్వామి, సుబ్బారావు, అర్జున్‌రావు, కృష్ణ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

నిమ్మల రామానాయుడుకు సిపిఎం, సిపిఐ నేతల వినతి



వినతిపత్రం అందిస్తున్న సిపిఎం, సిపిఐ నేతలు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసి నిరాశ్రయులవుతున్న నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యలను కుక్కునూరు సిపిఎం మండల కమిటీ తీసుకెళ్లింది. శనివారం జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు వేలేరుపాడు నిర్వాసితుల సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన సందర్భంగా కుక్కునూరు సిపిఎం మండల కమిటీ పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రామానాయుడుకు అందించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ కుక్కునూరు మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లించాలని, మాధవరం, కౌండిన్యముక్తి, గొల్లగుప్ప గ్రామాలను మొదటి కాంటూర్‌లో చేర్చాలని, కొత్తూరు నిర్వాసితులకు వారికి కేటాయించిన గృహాలను వారికి ఇవ్వాలని, 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీ యువకులకు కూనవరం, విఆర్ పురం, చింతూరు తదితర మండలాల్లో 2021 కట్ ఆఫ్ తేదీగా ప్రకటించి ఇచ్చిన పరిహారం ప్రకారం కుక్కునూరు, వేలూరుపాడు మండలాల్లోని యువతీ యువకులకు కూడా అదే విధంగా పరిహారం చెల్లించాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు యర్నం సాయికిరణ్, మేడిపల్లి బాబు, లక్ష్మయ్య పాల్గొన్నారు

వేలేరుపాడు : పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని వేలేరుపాడు పర్యటనకు వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడుకు సిపిఎం, సిపిఐ నాయకులు వినతిపత్రం అందించారు. అర్హులైన ప్రతిఒక్క నిర్వాసితునికీ న్యాయం చేయాలని, సర్వే సమయంలో అర్హులైన వారిని కూడా నాన్ రెసిడెన్షియల్‌గా ప్రకటించారని, కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఎక్కువ నష్ట పోతున్నారని, వారిని గుర్తించి నష్టపరిహారం అందించాలని, మిగులు భూములను కూడా సర్వే చేసి పూర్తి పరిహారం అందించాలని, గతంలో వచ్చిన వరదలను దృష్టిలో పెట్టుకుని మండలాన్ని యూనిట్‌గా తీసుకుని నష్టపరిహారాలు అందించాలని కోరారు. అలాగే ముంపునకు గురవుతున్న చాగరపల్లి తాట్కూరు గొమ్ముకాలనీ, యర్రబోరు పాత పూచిరాల, మద్దిగట్ల, గుంపెనగూడెం, వసంతవాడ, గీగవారి గుంపు కొర్రాజులగూడెం, పడమటమెట్ట, గాలివారిగుంపు, శివకాశిపురం గ్రామాలను ముందుగా మొదటి కాంటూరు పరిధిలో తీసుకోవాలని, ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ధర్ముల రమేష్, మడివి దుర్గారావు, కుక్కునూరు మండలాధ్యక్షులు నాగేంద్రరావు, సిఐటియు నాయకులు సాయికిరణ్, సిపిఐ నాయకులు మన్నవ కృష్ణ, చైతన్య, సిపిఐ మండల కార్యదర్శి బాడిస రాము, కారం ధారయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారులు వస్తారంటేనే శుభ్రం చేస్తారా..!

- ప్రజాశక్తి కథనంతో కదిలిన యంత్రాంగం
- కలెక్టర్ వస్తున్నారని తెలియడంతో హాస్టల్‌లో అధ్వానంగా ఉన్న సమస్యలపై దృష్టి
- ఉన్నతాధికారులను ఏమార్చే ప్రయత్నం

ప్రజాశక్తి - చింతలపూడి


చింతలపూడి మండలం యర్రగుంటపల్లి ప్రభుత్వ బాలుర బిసి హాస్టల్‌పై అధికారులు దొంగాట ఆడుతున్న పరిస్థితి నెలకొంది. వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజాశక్తిలో అక్టోబర్ 30వ తేదిన "వసతి గృహం.. సమస్యలు అనేకం" అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు వివరణ ఇస్తూ హాస్టల్‌లో ఎటువంటి సమస్యలు లేవంటూ పేర్కొన్నారు. అధికారుల వివరణ చూసి స్థానికులు, విద్యార్థులు అవాక్కయ్యారు. హాస్టల్‌ను పరిశీలించేందుకు కలెక్టర్ వస్తున్నారనే సమాచారం అధికారులకు అందింది. అంతే ఆగమేఘాల మీద హాస్టల్ మరుగుదొడ్లు, చుట్టూ పక్కాల బ్లీచింగ్ చల్లారు. మరుగుదొడ్లు శుభ్రం లేక ఆరు బయటకు వెళ్లటంతో దుర్వాసనా వస్తుందని చుట్టూపక్కల వారు స్థానిక అధికారులకు తెలిపారు. అయినప్పటికీ మరుగుదొడ్ల వాసన హాస్టల్‌కు సంబంధించింది కాదంటూ అధికారులు బుకాయించారు. స్థానికులు వెళ్లి చూస్తే హాస్టల్ నుంచే వాసన వస్తుందని తెలుసుకున్నారు. వసతి గృహం పెంకుటిల్లు అవ్వడంతో వాసాలు చెదలు పట్టి పడిపోయే పరిస్థితిలో ఉన్న అది కాదనటం స్థానికులకు ఆశ్చర్యం కలిగించింది. దీనిపై కలెక్టర్ వస్తున్నారని తెలియటంతో వసతి గృహం అధికారులు హడావిడిగా మరుగుదొడ్లు శుభ్రం చేసి బ్లీచింగ్ వేసిన పరిస్థితి నెలకొంది. బిసి బాలుర హాస్టల్‌లో అధ్వానా పరిస్థితి ఉన్నా అక్కడి అధికారులు మాత్రం జిల్లా కలెక్టర్‌కు తప్పుడు నివేదికలు ఇచ్చిన పరిస్థితి కనిపించింది. విద్యార్థుల సమస్యలపై కలెక్టర్ దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై యర్రగుంటపల్లి టిడిపి ఎంపిటిసి సభ్యులు భాస్కర్ మాట్లాడుతూ బిసి హాస్టల్‌లో వసతులు సక్రమంగా లేవని, సొంత భవనం నిర్మాణానికి కలెక్టర్ నిధులు మంజూరు చేయిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని తెలిపారు.

సమస్యల వలయంలో వసతి గృహం

- నేల పైనే నిద్రిస్తున్న విద్యార్థులు
- అమలు కాని భోజనం మెనూ
- వేధిస్తోన్న సిబ్బంది కొరత
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు



సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహం



నేల పైనే నిద్రిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని ఎఎస్ఆర్ స్టేడియం వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహంలో అనేక సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. ఈ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో సుమారు వంద మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరు ఇంటర్ నుంచి డిగ్రీ, బీటెక్ వంటి విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న సిఆర్‌రెడ్డి, కోటదిబ్బ కాలేజీలకు వెళు



న్నారు. వీరు కళాశాలకు వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ లోపల ఉన్న మరుగుదొడ్లు శుభ్రత లేక వాసన వస్తున్నాయి. వందమంది ఉన్న ఈ వసతి గృహంలో ఉన్న మరుగుదొడ్లు వారానికి ఒక్కసారి మాత్రమే శుభ్రం చేస్తారు. అది కూడా నామమాత్రంగానే జరుగుతుంది. అదేవిధంగా పడుకోవడానికి మంచాలు లేక విద్యార్థులు నేల మీదనే దుప్పట్లు వేసుకుని నిద్రిస్తున్నారు. కనీసం కిటికీలకు మెస్సులు కూడా లేకపోవడంతో దోమలు విలయతాండవం చేస్తున్నాయి. ప్రభుత్వం విద్యార్థులకు ఒక ఆహార మెనూ ఏర్పాటు చేసినప్పటికీ, ఇక్కడ విద్యార్థులకు ఆ మెనూ అమలు కావడం లేదు. మధ్యాహ్నం భోజనానికి కేవలం ఒక కూర, రైస్ మాత్రమే వండుతున్నారు. అది కూడా ఉదయం టిఫిన్ వండడానికి వచ్చి, మధ్యాహ్నం భోజనానికి కూడా అప్పుడే వంట చేసి ఒక గదిలో వదిలేస్తున్నారు. వాటి మీద సరైన మూతలు లేక ఆహారంపై ఈగల వాలుతున్నాయి. కనీసం భోజనశాల కూడా శుభ్రంగా ఉండడంలేదు. భోజనశాలల్లోకి కుక్కలు వచ్చి నిద్రిస్తున్నాయి. విద్యార్థులు సరైన వసతులు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వసతి గృహం పరిసర ప్రాంతాలు అడవిని తలపిస్తున్నాయి. కనీసం సరైన దారి లేక వర్షం కురిసినప్పుడు నీరు నిలిచిపోతుంది. వసతి గృహం చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా తయారైంది. అదేవిధంగా సరైన ప్రహరీ గోడ సైతం లేదు. వసతి గృహానికి సరైన సిబ్బంది, వాచ్‌మెన్ కూడా లేకపోవడం గమనార్హం. అధికారులు ఇప్పటికైనా తమ వసతిగృహంపై దృష్టి పెట్టి విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలని ఆవేద న వ్యక్తం చేస్తున్నారు. తమకు సరైన ఆహారమైనా శుభ్రంగా అందించాలని విద్యార్థులు ,తల్లిదండ్రులు కోరుతున్నారు.


ప్రభుత్వం సిబ్బందిని నియమించాలి

రాజబాబు, హాస్టల్ వార్డెన్

ప్రభుత్వం మెయింటెనెన్స్ ఖర్చులు ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1600 మాత్రమే ఇస్తుంది. ప్రభుత్వం వంట చేయడానికి, మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి సిబ్బందిని, వాచ్‌మెన్‌ను నియమిస్తే బాగుంటుంది. మొన్ననే చెట్లు కొట్టించాం. వర్షాకాలం కావడంతో మళ్లీ పెరిగాయి. వర్షాలు తగ్గిన తర్వాత మళ్లీ చెట్లను తొలగిస్తాం.

2,60,036 మందికి రూ.113.72 కోట్లు పంపిణీ

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



పింఛను అందజేస్తున్న మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని నరసింహారావు పాలెం కొత్త అర్జునవాడ, మెయిన్ రోడ్డు, సాగర్ బజార్లో శనివారం అవ్వ తాతలు, వికలాంగులు, వితంతువులకు ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఇంటింటికీ స్వయంగా వెళ్లి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శనివారం అందజేశారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి నివాళులర్పించారు. ప్రజలు అడిగిన కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించారు. కొందరు ఇల్లు కావాలని అడగగా వెంటనే దరఖాస్తులు పెట్టుకోండి వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. చాట్రాయి మండలంలో 100 మందికి పైగా గొర్రెలు పెంపకం దారులను గుర్తించి ఒక్కొక్కరికి రూ.4 లక్షలు చొప్పున నాలుగు కోట్లు మంజూరుకు అధికారులు చర్యలు చేపట్టాలని, బ్యాంకు అధికారులతో మంత్రి కొలుసు పార్థసారథి స్వయంగా మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు, వికలాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు, బెడ్ రెస్టులో ఉన్న వారికి రూ.10 వేలు, రూ.15 వేలు చొప్పున పెంచి అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం హంగులు, ఆర్భాటాలు, రంగులమీద పెట్టిన శ్రద్ధ వృద్ధులు, వితంతువులు, వికలాంగులపై పెట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ జి.బద్రు, ఎంపిడిఒ బిఎ.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

పెరిగిన గోదావరి నీటిమట్టం


ప్రాజెక్టు నుంచి 3,42,950 క్యూసెక్కులు విడుదల

పోలవరం : తుపాన్ ప్రభావంతో ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉప నదులు కలుస్తుండడంతో గోదావరి నీటిమట్టం శనివారం నాటికి పెరుగుతూ వస్తుంది. ప్రాజెక్టు నుంచి 3,42,950 క్యూసెక్కుల జలాలను జలవనరులశాఖాధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 29.100 మీటర్లు, స్పిల్ వే దిగువన 19.500 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 20.200 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 18.200 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 15.900 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మై కింగ్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి లో సాయిస్ఫూర్తి హాస్పిటల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటుచేసిన మై కింగ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పొలిమేట్ల ఫణి మాట్లాడుతూ ఎంఎల్ఎ రోషన్‌కుమార్ తనకు స్ఫూర్తి అని అన్నారు. ఆయన అమెరికాలో ఉన్నప్పుడే పదవి రాకముందే నా కష్టాన్ని తెలుసుకుని సహాయం అందించారని, ఇప్పుడు అదే స్ఫూర్తితో నాకున్న దానిలో నా స్నేహితుల సహాయంతో అవసరతలో ఉన్నవారికి కొంత సహాయపడుతున్నాని తెలిపారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

పని గంటల పెంపును విరమించుకోవాలి

ప్రజాశక్తి - నిడమర్రు

ప్రభుత్వం పని గంటల పెంపును విరమించుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. మండలంలోని నిడమర్రు, అడవికొలను, భువనపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తూ నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కార్మికులను నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకొచ్చిన తర్వాత కార్మికులు పోరాడి సాధించుకున్న పనిగంటల హక్కులను హరిస్తూ, కాలరాస్తుందన్నారు. పని గంటల పెంపును వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, లేకపోతే కార్మికులు పోరాటాలతో తిరుగుబాటు చేస్తారని చెప్పారు. కార్మికులు సంక్షేమ బోర్డు అమలు కోసం ప్రభుత్వంతో పోరాటాలతోనే సాధించుకోవాలని కార్మికులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రోకలి ఏసురెడ్డి, కోసూరి శివ, కమిలి నాని, శంకు సురేష్, టెంకాల శ్రీనివాస్, లావేటి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం చేతుల మీదుగా లతీఫ్ పాషాకు అవార్డు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపలి తహ శీల్దార్ లతీఫ్ పాషా సిఎం చంద్రబాబు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. విజయవాడలో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ ఈ అవార్డు అందుకున్నారు. మొంథా తుపాన్ హెచ్చరికలు వచ్చిన నాటి నుంచి నిరంతరం పర్యవేక్షించడంతో పాటు రక్షణ చర్యలు తీసుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం తహశీల్దార్‌కు ప్రశంసపత్రం, మెమొంటో అందించారు. లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస శిబిరాలకు తరలించారు. పడిపోయిన చెట్లను తొలగింపు చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేయడం, నీట మునిగిన ప్రాంతాల్లో ఉన్న వారిని ఆదుకోవడం, వారికి పునరావాసం కల్పించడం వంటివి విధులు సమర్థవంతంగా నిర్వహించినందుకు ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడం పట్ల తహశీల్దార్ లతీఫ్ పాషా ఆనందాన్ని వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న తహశీల్దార్

ఆదిత్య విద్యార్థులు రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఏలూరులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వంగా వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో జరిగే ప్రతి సేవా కార్యక్రమాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ముందుంటారని, అమరవీరుల త్యాగాలను మనందరం మర్చిపోకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదిత్య డిగ్రీ కళాశాల బృందాన్ని, విద్యార్థులను పోలీస్ శాఖ వారు అభినందించారు.

నూజివీడు టౌన్ :పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో పోలీసులు ఆటో డ్రైవర్లు, ట్రిపుల్ ఐటీ విద్యార్థులు స్వచ్ఛందంగా 30 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల సేవలను చిరస్మరణీయంగా నిలుపుకోవాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ముసునూరు :మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు అందించే భోజనం రుచిగా, శుచిగా ఉండాలని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని రమణక్కపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శుశనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనం పరిశీలించి రుచి చూశారు. వంటవారికి పలు సూచనలు చేశారు. పాఠశాలలో టాయిలెట్స్ పరిశీలించారు. ఎఫ్ఎ-2 పరీక్షా పత్రాలు పరిశీలించారు.

నేరాలు - ఘోరాలు

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బైక్‌ను లారీ ఢీ కొనడంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన ఏలూరు రూరల్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ మండలం మహేశ్వరపురపుపాలెంకి చెందిన మద్దల రూత్(25) తన భర్త నాగేంద్ర, ముగ్గురు పిల్లలతో కలిసి బైక్‌పై శనివారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరారు. ఈ సమయంలో కైకలూరు వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ సుంకరవారితోట సమీపంలో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రూత్ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త, పిల్లలు స్వల్ప గాయాలపాలయ్యారు. ఘటన స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

పోలవరం :విద్యుదాఘాతంతో చెట్టు నరికే కూలీ మృతి చెందిన ఘటన పోలవరం మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలవరం స్టేషన్ రైటర్ భీమశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... పోలవరం మండలం ఎల్ఎన్‌డి పేట గ్రామానికి చెందిన కుక్క ఆదినారాయణ (28) తన గ్రామానికి చెందిన తన ఉన్నతో కలిసి ఇద్దరు కూలీలతో పట్టిసీమ యామిని కళ్యాణ మండపం సమీపంలో చెట్టు కట్ చేసే మిషన్‌తో పనికి వెళ్లారు. పనిస్తున్న క్రమంలో సమీపంలో ఉన్న విద్యుత్ వైరును పైకి లేపుతుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు రైటర్ భీమశేఖర్ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు

టి.నరసాపురం :మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కొవ్వూరు మండలం పసకపూడి గ్రామానికి చెందిన పసలపూడి కుమారి (52) అక్టోబర్ 11వ తేదీన తన తండ్రి ఆరోగ్యం బాగోలేదని చూడడానికి మండలంలోని అప్పలరాజుగూడెం వచ్చింది. తండ్రి చనిపోవడంతో కార్యక్రమాలు ముగించుకుని అక్టోబరు 30వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయలు దేరి వెళ్లింది. అప్పటి నుంచి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వస్తుంది. చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. మహిళ తమ్ముడు జల విజయరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

దొరికిన పర్సు పోలీసులకు అప్పగింత

నూజివీడు టౌన్ : దొరికిన పర్సును పోలీసులకు అప్పగించిన వ్యక్తులను పలువురు అభినందించారు. మండలంలోని అన్నవరం గ్రామంలో శ్రీరామ మందిరం వద్ద వెంకటాయపాలెంకి చెందిన పూజారి పాండురంగారావు, భీమల రవిలకు పర్సు దొరికింది. పట్టణంలో సర్ధి చేసి తిరిగి వెళ్తుండగా రోడ్డుపై కనిపించిన పర్సును నూజివీడు రూరల్ పోలీసులకు అందించారు. పర్సులో రూ.4200 నగదు, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నట్లు చెప్పారు. పాండురంగారావు, రవిలను పోలీసులు అభినందించారు. పరుసు కోల్పోయిన నూజివీడు పట్టణం గొడుగువారిగూడెం ప్రాంతానికి చెందిన బచ్చు తిరుపతిరావుకు పిలిపించి అందించారు. ఇద్దరు వ్యక్తులను పోలీసులు, పలువురు అభినందించారు.

ఇష్టంతో చదివితేనే ఉన్నత శిఖరాలు

వేలేరుపాడు కస్తూరిబా బాలికా విద్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - వేలేరుపాడు

కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉన్నతశిఖరాలు చేరుకోవచ్చని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విద్యార్థినులకు ఉద్బోధించారు. వేలేరుపాడులో కస్తూరిబా బాలికా విద్యాలయాన్ని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థినులకు బోధనా విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్యా ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు. చదువును కష్టంతో కాక ఇష్టంతో చదివితే విజ్ఞానాన్ని మరింత పెంచుకుపోవచ్చన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ఇష్టంతో కష్టపడి చదవాలని, పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనభ్యసించేలా విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలన్నారు. తరగతి గదిలో విద్యార్థినులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని, వాటిలో ప్రత్యేక బోధనా తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రతి తరగతి గదిని పరిశీలించి, ఉపాధ్యాయుల బోధనను, విద్యార్థినుల విజ్ఞాన స్థాయిని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విద్యాలయం పరిసరాలను, పారిశుధ్య పరిస్థితులను కలెక్టర్ పరిశీలించారు. ఆమెతో పాటు జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ రమణ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజల సంక్షేమానికి కూటమి కృషి

పింఛన్ల పంపిణీలో ఎంఎల్‌ఎలు, నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజల చెంతకే పాలన అనే సమున్నత లక్ష్యానికి మరింత ప్రాధాన్యత చేకూర్చేందుకు శక్తివంచన లేకుండా పాటుపడుతున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరులోని 46వ డివిజన్‌లో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్ఎ బడేటి చంటి, ఆర్‌టిసి విజయవాడ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, మేయర్ నూర్జహాన్ హాజరయ్యారు.

చింతలపూడి : కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమ కోసం కృషి చేస్తుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పథకంలో భాగంగా శనివారం చింతలపూడి పట్టణం, రేచర్ల గ్రామంలో కూటమి నాయకులతో కలిసి పింఛన్లు అందించారు.

జంగారెడ్డిగూడెం :సిఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు అన్నారు. శ్రీనివాసపురం గ్రామంలో సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులతో కలిసి పెన్షన్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎఎంసి వైస్ ఛైర్మన్ మారిశెట్టి వీర వెంకట సత్యనారాయణ, మండల రైతు అధ్యక్షుడు ఎల్‌కె.వరప్రసాద్, క్లస్టర్ ఇన్‌ఛార్జి రాగానే శ్రీనివాసరావు, బండారు వెంకటరావు, బిసి సెల మండల ప్రధాన కార్యదర్శి రాగాని రామకృష్ణ, సత్యనారాయణ గౌడ్, ప్రసాద్, తడికల దావీదు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తుపాన్ వల్ల ఆర్థికంగా ఇబ్బందులు వచ్చిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఎటువంటి ఆటంకాలు లేకుండా పాలన సాగిస్తున్నారని టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో వివిధ వార్డుల్లో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలో ప్రతివార్డులో ఉన్న కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారులకు ఇళ్ల దగ్గరే పింఛన్లు పంపిణీ చేశారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా సత్యనారాయణ, ఇమ్మడి రత్నాజీ, ఓం ప్రకాష్‌చౌదరి, శేషు, మండల ఇన్‌ఛార్జి పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి :మండల వ్యాప్తంగా 4229 పింఛన్లకు 3998 ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను శనివారం సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. పింఛన్ల పంపిణీలో కొంతసేపు సర్వర్ ఇబ్బంది పెట్టినా పింఛన్ల పంపిణీ ఆగలేదన్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు పాల్గొన్నారు. మండలవ్యాప్తంగా తొలిరోజు 94.54 శాతం పూర్తైనట్లు తెలిపారు.

దెందులూరు : నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శనివారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైన పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పాల్గొని పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో వ్యకాస జిల్లా మహాసభ

ప్రజాశక్తి - టి.నర్సాపురం

ఈ నెల 5,6 తేదీల్లో టి.నరసాపురంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం 32వ జిల్లా మహాసభ జయప్రదం చేయాలని వ్యకాస జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశాన్ని కమిటీ సభ్యురాలు బత్తుల గంగాభవాని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ మండలంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభకు జిల్లాలో ఉన్న ఉపాధి కూలీలు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఐదో తేదీన జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. వ్యకాస నిరంతరం ఉపాధి కార్మికులు, కూలీల సమస్యలు పరిష్కారం కోసం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కలపాల గాంధీ, ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు, ఎల్లమ్మ, కె.చల్లాయమ్మ, పైదా రామలక్ష్మి పాల్గొన్నారు.

8,9 తేదీల్లో రైతు సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తుపాను కారణంగా వాయిదా వేసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా మహాసభను ఈ నెల 8, 9 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. జంగారెడ్డిగూడెం మండలంలోని మైసన్నగూడెంలో రైతు సంఘం మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 8వ తేదీన ఉదయం 9.30 గంటలకు రోటరీ క్లబ్ హాలులో ఈ మహాసభ ప్రారంభమవుతుందన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి రైతు ప్రతినిధులు మహాసభలో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

కార్డ్స్ ఆధ్వర్యాన బాలబాట డిఒసి శిక్షణ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సమాజంలోని వెనకబడిన తరగతుల పిల్లల విద్యాభివృద్ధి కోసం సిజిసి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు కీర్తిశేషులు రంజన్ బాబు ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ కార్డ్స్ సంస్థ అనేక జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో బాలబాట కేంద్రాలను నిర్వహిస్తోందని, ఈ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ అనేకమంది చిన్నారులు చదువు ద్వారా తమ జీవితాలను మెరుగుపరు చుకుంటున్నారని సంయుక్త సంచాలకులు పుష్పలత, ఉపసంచాలకులు అనిత తెలిపారు. ఈ క్రమంలో కొయ్యలగూడెం మండలం అంకాలగూడెం గ్రామంలోని సిజిసి వికలాంగుల పాఠశాలలో కార్డ్స్ ఆధ్వర్యంలో బాలబాట డిఒసి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపిపి గంజిమాల రామారావు మాట్లాడుతూ సిజిసి సేవలు ప్రజలకు మంచి ఫలితాలు ఇస్తున్నాయని, తమ ప్రాంతంలో బాలబాట కేంద్రాలు ఏర్పాటు కావడం గర్వకారణమన్నారు. రంజన్ బాబు సేవా భావాన్ని కొనసాగించేలా డిఒసిలను ప్రోత్సహిం చారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరైన తెలుగు మహిళా నాయకురాలు గంగిరెడ్ల మేఘాలదేవి, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చిడిపి రవి, పోలవరం నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ బాజీ, రోటరీ క్లబ్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, ఇన్‌ఛార్జి అపర్ణ చేతుల మీదుగా డిఒసిలకు ప్రతి నెలా పంపిణీ చేసే నిత్యావసర సరుకులను అందించారు.

జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు 3న ఎంపిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల మూడో తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుండి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు బాల బాలికల ఎంపికలు జరుగుతాయని జిల్లా కబడ్డీ సంఘం సెక్రటరీ కె.రంగారావు శనివారం తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనేవారు, బాలురు 60 కేజీల లోపు, బాలికలు 55 కేజీల లోపు బరువు ఉండాలని 2009 డిసెంబర్ ఒకటో తేదీ తరువాత పుట్టినవారు అయి ఉండాలని ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డుతో హాజరు కావాలని తెలిపారు. టి.నరసాపురం హైస్కూల్లో జరిగే సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఎంపికలో పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెక్రటరీ కె.రంగారావు 9951931133కు సంప్రదించాలని తెలిపారు.

తుపానుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మాజీ ఎంఎల్‌ఎలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాష్ట్రానికి వెన్నెముక వంటి రైతులను తక్షణమే ఆదుకోని, తగిన నష్ట పరిహారం అందించాలని ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ వాసుబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొంథా తుపాన్ ప్రభావంతో వరి పంటలు తీవ్ర నష్టం చవిచూసిన రైతాంగాన్ని పరామర్శించేందుకు మండలంలోని కాగుపాడు గ్రామంలో స్థానిక రైతులతో, వైసిపి నాయకులతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా తుపాన్ ప్రభావితం వల్ల కౌలు రైతులతో ముఖాముఖి మాట్లాడి కౌలు, పెట్టుబడి,వాటిల్లిన నష్టం వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, రైతుల పంట నష్టానికి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ముదినేపల్లి : తుపాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కైకలూరు మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మొంథా తుపాన్‌కు దెబ్బతిన్న పొలాలను శనివారం పార్టీ శ్రేణులతో మండలంలోని చిగురుకోట శివారు నరసన్న పాలెంలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంట నష్టం అంచనాలను తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఇహెచ్ఎస్ అమలు హర్షణీయం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగ విరమణ చేసిన ఆర్‌టిసి ఉద్యోగులకు ఇహెచ్ఎస్ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. 2020 జనవరి 1 తర్వాత రిటైరైన వారికి ఇహెచ్ఎస్ వర్తింపు ఉంటుందని, ఒకసారి ప్రీమియం చెల్లిస్తే జీవితాంతం ఉచిత వైద్యం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, రిటైర్డ్ ఉద్యోగి భార్యకు కూడా ఉచిత వైద్యం వర్తిస్తుందని, అంతేకాకుండా ఆర్‌టిసి ఆసుపత్రుల్లోనూ ఉచిత వైద్యం, మందులు అందించాలని ఆదేశాలు ఇవ్వడం మంచి పరిణామమని తెలిపారు. ఆర్‌టిసి ఆసుపత్రుల సిఫారసు మేరకు ఇహెచ్ఎస్ ఆసుపత్రుల్లో చికిత్స లభిస్తుందని, రెగ్యులర్ ఉద్యోగులకు రియంబర్స్‌మెంట్ సౌకర్యం కూడా ప్రభుత్వం కల్పించిందని తెలిపారు.

శ్రీవారి ఆలయానికి వీల్ ఛైర్స్ బహూకరణ

ప్రజాశక్తి- ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే వికలాంగుల కోసం ఏలూరుకు చెందిన బాలాజీ ఫార్మాటికల్స్ అధినేత, ఆంధ్ర హాస్పిటల్ డైరెక్టర్ జి.రవిచంద్ర ఐదు వీల్ చైర్లను అందించారు. వెంకటేశ్వర స్వామివారి ఉచిత ప్రథమ చికిత్స కేంద్రం డాక్టర్ ఆర్.రాజేంద్ర, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పైడేశ్వరరావుకు వీల్ చైర్స్ అందించారు. దాతలకు శ్రీవారి దర్శనం వేద ఆశీర్వచనం, స్వామి వారి తీర్థ ప్రసాదాలు ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.

హైస్కూల్‌లో కిశోర వికాసం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని కెపిడిటి హైస్కూల్‌లో శనివారం కిశోర వికాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సూపర్‌వైజర్ మంగ మాట్లాడుతూ ఎనిమియా, పోషణ అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికలు ఎదుగుదల దశలో ఎదుర్కొనే శారీరక, మానసిక మార్పులను ఎదుర్కొవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొని చురుకుగా స్పందించారు.

ముసునూరు :బాల్యం దశలో వివాహం చేస్తే చాలా అనర్థాలు ఎదుర్కొనే పరిస్థితి ఎదురవుతుందని ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ పి.రాజకుమారి అన్నారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలిక వికాసం కార్యక్రమంలో భాగంగా వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిబాబు, ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలను నాటాలి

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పోలవరం గ్రామంలో శనివారం చెత్త కుప్పలు వద్దు చెట్టులెంతో ముద్దు అనే పర్యావరణ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని చెత్త కుప్పలను తొలగించి, వాటి స్థానంలో చెట్లను నాటడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా, హరితంగా మార్చే దిశగా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణం ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రవికుమార్, పంచాయతీ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం, సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం ముదినేపల్లి సెంటర్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్యవైశ్య ప్రముఖులు నివాళులర్పించారు. వై.జంక్షన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య ప్రముఖులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వికాస్ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు, కొత్తూరు సుబ్బారావు, పూర్ణచంద్రరావు, కారుమూరి వెంకటేశ్వరరావు, బుద్ధ రామకృష్ణ, కొల్లిపర చలపతి, కోటేశ్వరరావు, స్వామి, మణికంఠ, వాసు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

చింతలపూడి : రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం, ఆయన సేవలు ఎప్పటికీ మరువలేనివని ఎంపిపి రాంబాబు, ఎంపిడిఒ కామేశ్వరి అన్నారు. మండలంలో పొట్టి శ్రీరాములు జయంతి, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరులైనట్లు విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి, కైకలూరు మధ్య రాకపోకలు ప్రారంభం

ప్రజాశక్తి - కలిదిండి

కలిదిండి నుంచి కైకలూరుకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్థానిక లాల్వా మురుగు కాలువపై వంతెన రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం కాలువపై తూములు పెట్టి రోడ్డు పోయడంతో రాకపోకలకు వీలు కలిగింది. గతంలో ఇలానే తాత్కాలిక వంతెన వేస్తే కొట్టుకుపోయిందని, పక్కా వంతెన నిర్మాణం చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.